సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 26 । జనవరి । 2025



మహిళామణులు..
జిల్లాలోని పలువురు మహిళలు సొంతంగా వ్యాపారాలు నిర్వహిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు.
- 8లో ▸



ప్రజాస్వామ్య పరిరక్షణకు..
ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల వ్యవస్థ పునాదిగా నిలుస్తోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.4 /13.7

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొన సాగుతుంది.

న్యూస్‌రీల్

పట్వారీకి అరుదైన గౌరవం

- 50 ఏళ్లపాటు జాతీయ జెండా ఆవిష్కరణ



బోధన్: బోధన్ పట్టణానికి చెందిన డీసీసీబీ మాజీ చైర్మన్ గంగాధర్‌రావు పట్వారీ ప్రజాప్రతినిధిగా 50 ఏళ్లకు పైగా జాతీయ జెండా ఆవిష్కరించారు. ఆయన బోధన్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం పాటు పని చేశారు. 1962 నుంచి 1981 వరకు, 1985–1991, 1995 నుంచి 2020 వరకు సంఘ అధ్యక్షుడిగా ఉన్నారు. 2015 నుంచి 2020 వరకు నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగారు. 50 ఏళ్లుగా పైగా ఆయన జెండా ఆవిష్కరించారు. ప్రస్తుతం ఆయన బోధన్ పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

రిపబ్లిక్ డే ఏర్పాట్ల పరిశీలన



నిజామాబాద్ అర్బన్: నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో గణతంత్ర వేడుకలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఉదయం 9 గంటలకు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. వేడుకల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ శనివారం ఏర్పాట్లను పరిశీలించారు.

నాణ్యమైన భోజనం అందించాలి



వర్ని: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని బోధన్ కోర్టు మేజిస్ట్రేట్ సాయిశివ సూచించారు. శనివారం వర్ని మండలం కోటయ్య క్యాంపులోని గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు, హాస్టల్ నిర్వాహకులు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. వర్ని ఎస్సై రమేశ్, ఏఎస్సై నాగభూషణం పాల్గొన్నారు.

నీటి సంఘాలు ఏర్పాటు చేయాలి



నిజామాబాద్ సిటీ: స్థానిక రైతులతో నీటి సంఘాలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ కోరారు. కమిషన్ సభ్యులు శనివారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. మైనర్ ఇరిగేషన్‌ను మేజర్ ఇరిగేషన్ నుంచి విడదీసి అభివృద్ధి చేయాలని కోరారు. కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవానీ రెడ్డి, చెవిటి వెంకన్నయాదవ్ ఉన్నారు.

వర్గీకరణ పోరాటంలో భాగస్వాములు కావాలి



నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న నిర్వహించే లక్ష డప్పులు – వెయ్యి గొంతులు సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కోరారు. నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదిగ పిల్లలు బాగు పడాలంటే పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు. వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. వర్గీకరణను అడ్డుకునే శక్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం సపోర్ట్ చేయొద్దన్నారు. నాయకులు సరికెల పోశెట్టి, కనక ప్రమోద్, మైలారం బాలు, సురేశ్, నాగభుషణం, సంతోష్, యాదయ్య, రాజేశ్వర్ పాల్గొన్నారు.

జవాన్ల ఊరు



- అడవి మామిడిపల్లికి మరోపేరు జైహింద్ పల్లి
- సైన్యంలో గ్రామానికి చెందిన 17 మంది
- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం

రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయింది. ఆదివారం నిర్వహించనున్న 76వ గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశ రక్షణకు వీర సైనికులను అందించిన 'అడవి మామిడి పల్లి', అంది వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని సోలార్ వెలుగులు విరజిమ్ముతున్న 'గంగగడ్డ నడ్కుడ' గ్రామాలపై ప్రత్యేక కథనాలు..




గంగోనే విక్రమ్


కల్లెడ సాయి


దేవేందర్


సంగం అనిల్


లంబాని ప్రేమ్


చంద్రశేఖర్


జానకీరామ్


కేతావత్ రవి


మావూరి రాజు

మాక్లూర్: సైన్యంలో చేరుతూ ఆ గ్రామంలో యువత ఆదర్శంగా నిలుస్తున్నారు. మది నిండా దేశభక్తితో సైన్యంలో చేరుతున్నారు అడవి మామిడిపల్లి యువకులు. ఒక్కొక్కరుగా మిలట్రీలో చేరి గ్రామాన్ని జైహింద్‌పల్లిగా పిలిచే స్థాయికి తెచ్చారు. ఈ గ్రామం నుంచి మొట్టమొదటి మిలట్రీ మ్యాన్ చంద్రశేఖర్. ఆయనను స్ఫూర్తిగా తీసుకున్న గ్రామ యువత ఒక్కొక్కరుగా ఇప్పటి వరకు 17 మంది సైన్యంలో చేరారు. మరో 10 మంది అగ్నిపథ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. జానకిరామ్, కాలేవార్ రాజు కమాండర్ స్థాయిలో దేశసేవ చేసి రిటైర్డు అయ్యారు. గంగోనే విక్రం, కల్లెడి సాయి, దేవేందర్, సంగెం అనిల్, లంబాని ప్రేమ్, రాజేష్, గంగోనే బాలాజీ, పొల్ల నవీన్, కెతావత్ రవీందర్‌నాయక్ మరికొంత మంది ప్రస్తుతం సైన్యంలోనే ఉన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని మరో 30 మంది యువకులు మిలట్రీలో చేరటమే లక్ష్యంగా శిక్షణ తీసుకుంటున్నారు.

సైన్యంలో చేరడానికి ఎన్‌సీసీలో చేరాను



మా ఊరి నుంచి మిలట్రీలోకి వెళ్లిన వారి సంఖ్య 17 వరకు ఉంటుంది. వారిని స్ఫూర్తిగా తీసుకొని నేను సైన్యంలో చేరాలని అనుకుంటున్నా. అందుకే ఎన్‌సీసీలో చేరి జూనియర్ అండర్ ఆఫీసర్ స్థాయిలో కొనసాగుతున్నా. – జ్ఞానదీప్, బీటెక్, అడవి మామిడిపల్లి

జీజీ నడ్కుడ జిల్లాకు ఆదర్శం..

- సోలార్ సిస్టంలో ఆదర్శం
- విద్యుత్ చార్జీల నుంచి విముక్తి
- సమర్థవంతంగా నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ





జీజీనడ్కుడ జీపీ కార్యాలయం, గ్రామంలో సోలార్ యూనిట్

డొంకేశ్వర్(ఆర్మూర్): పల్లెలు టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటున్నాయి. ఇప్పటికే ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలు అందుతున్నాయి.అయితే డొంకేశ్వర్ మండలానికి చెందిన గంగగడ్డ (జీజీ) నడ్కుడ గ్రామం సోలార్ సిస్టం వినియోగంలో ఆదర్శంగా నిలుస్తోంది. ఊరికి అన్ని దిక్కులా ఎటు చూసినా సోలార్ పలకలే ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు భారీ విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో జిల్లాలోనే జీజీ నడ్కుడ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సోలార్ సిస్టంను ఏర్పాటు చేశారు. కలెక్టర్‌గా పని చేసిన నారాయణ రెడ్డి 'గ్రీన్ విలేజ్' పేరుతో దీనికి శ్రీకారం చుట్టారు. జీజీ నడ్కుడలో మూడేళ్ల క్రితం సోలార్‌ను సిస్టం ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీకి సంబంధించిన బోరు మోటార్లు, విద్యుత్ దీపాలకు 'సౌర' విద్యుత్‌ను వాడుతున్నారు. సోలార్ సిస్టం ఏర్పాటు చేయకముందు పంచాయతీకి ప్రతి నెలా రూ.1లక్షకు పైగా విద్యుత్ బిల్లు వచ్చేది. ఇప్పుడు సగం మాత్రమే విద్యుత్ బిల్లు వస్తోందని పంచాయతీ కార్యదర్శి సుప్రియ, మాజీ సర్పంచ్ బద్దం మధులిక (రఘు)వెల్లడించారు. సోలార్ సిస్టంను సమర్థవంతగా వాడుతున్న జీజీ నడ్కుడ గ్రామ పంచాయతీ బాటలోనే జిల్లాలోని మరిన్ని గ్రామ పంచాయతీలు నడవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బోధన్‌లో భారీ జాతీయ జెండా

- 101 అడుగుల ఎత్తులో ఏర్పాటు
- నేడు ఆవిష్కరించనున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



బోధన్‌లో ఏర్పాటు చేయనున్న జెండా మ్యాప్

బోధన్: బోధన్ పట్టణంలో భారీ జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు. 101 అడుగుల స్తంభం ఏర్పాటు చేశారు. ఏకచక్ర సేవా సమితి నేతృత్వంలో పట్టణంలో జాతీయ పతాకం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీని కోసం వివిధ వర్గాల నుంచి విరాళాలు సేకరించారు. సుమారు రూ.10 లక్షల ఖర్చుతో అంబేడ్కర్ చౌరస్తాలో జెండా స్తంభం, ప్లాట్‌ఫాం నిర్మించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 10:30 గంటలకు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఈ భారీ జాతీయ పతకాన్ని ఆవిష్కరించనున్నారు. అందరి భాగస్వామ్యంతో జాతీయ జెండా నెలకొల్పినట్లు ఏకచక్ర సేవా సమితి అధ్యక్షుడు అంకు మహేశ్ తెలిపారు.

నేడు నాలుగు పథకాలకు శ్రీకారం

- మండలానికో గ్రామంలో ప్రారంభోత్సవం
- అధికారులకు దిశా నిర్దేశం చేసిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఆదివారం ప్రారంభించనున్నట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, సంక్షేమ పథకాల అమలు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం మధ్యాహ్నం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. పథకాల అమలు కోసం చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతి మండలంలో ప్రజాప్రతినిధులను సంప్రదించి వారి సూచన మేరకు ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన ప్రతీ గ్రామంలోనూ పథకాల ప్రారంభోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎంపిక చేసిన గ్రామంలోనే నాలు గు పథకాల అమలును ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. ఆహార భద్రత కార్డులకు తహసీల్దార్ నేతత్వంలో, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపీడీవో ఆధ్వర్యంలో, రైతు భరోసాకు మండల వ్యవసాయ అధికారి నేతృత్వంలో, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఏపీవో ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు కార్యక్రమం విజయవంతం అయ్యేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. గ్రామాలకు వెళ్లడానికి ముందే ఆయా పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. గ్రామసభల సందర్భంగా వచ్చిన దరఖాస్తులను సైతం పరిశీలించి, ఆయా పథకాల కింద అర్హుల పేర్లను జాబితాలో చేర్చాలని, పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలోనే వారికి కూడా ప్రొసీడింగ్స్ అందించాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు పథకాలు ప్రారంభించే గ్రామాలు

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు పథకాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు జిల్లాలో పలు గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో పథకాలకు సంబంధించి అర్హులకు ప్రొసీడింగ్‌లను అందించనున్నారు. ఇందులో ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల జారీకి లబ్ధిదారులకు అర్హత పత్రాలు ఇస్తారు.

ఎంపికైన గ్రామాలు ఇవే..

మండలం	గ్రామం పేరు	జక్రాన్‌పల్లి	నారాయణ్‌పేట్	నవీపేట్	సిరన్‌పల్లి
ఆలూర్	మిర్దాపల్లి	కమ్మర్‌పల్లి	నాగాపూర్	నిజామాబాద్ రూరల్	మల్కాపూర్
ఆర్మూర్	కోమన్‌పల్లి	కోటగిరి	అడ్కాస్‌పల్లి	పొతంగల్	సోంపూర్
బాల్కొండ	జలాల్‌పూర్	మాక్లూర్	ముల్లంగి(బి)	రెంజల్	నీల పేపర్ మిల్
భీమ్‌గల్	లింగపూర్ చౌత్	మెండోర	కొడిచర్ల	రుద్రూర్	బొప్పాపూర్
బోధన్	లంగ్డాపూర్	మోర్తాడ్	దొన్కల్	సాలూర	తగ్గెల్లి
చందూర్	ఘన్‌పూర్	మోస్రా	తిమ్మాపూర్	సిరికొండ	చిన్నవాల్గోట్
ధర్పల్లి	సీతాయిపేట్	మోపాల్	నర్సింగ్‌పల్లి	వేల్పూర్	పోచంపల్లి
డిచ్‌పల్లి	కమలాపూర్	ముప్కాల్	వేంపల్లి	వర్ని	మల్లారం
డొంకేశ్వర్	గంగసముందర్	నందిపేట్	మల్లారం	ఎడపల్లి	జైతాపూర్
ఇందల్వాయి	అన్సాన్‌పల్లి			ఏర్గట్ల	దోమ్‌చంద

గులాబీల పోరు.. మరింత జోరు

- ప్రజాసమస్యలపై కార్యక్రమాలు చేపడుతున్న బీఆర్‌ఎస్
- రైతు ఆత్మహత్యలపై బీఆర్‌ఎస్ అధ్యయన కమిటీ సభకు రైతుల నుంచి స్పందన
- అన్నీ తామై వ్యవహరిస్తున్న ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి
- మరోవైపు జిల్లాలో కార్యక్రమాలు పెంచుతున్న ఎమ్మెల్సీ కవిత



రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న రైతు అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, సభ్యులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసే కార్యక్రమాల నిర్వహణలో బీఆర్‌ఎస్ పార్టీ మరింత స్పీడ్ పెంచుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజాపోరాటాల కార్యాచరణతో ముందుకు సాగుతోంది. జిల్లాలో మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజా సమస్యల విషయమై అన్నీ తామై నడిపిస్తున్నారు. ఇప్పటివరకు వరుసగా రైతు రుణమాఫీ, ఎల్‌ఆర్‌ఎస్, ధాన్యం బోనస్, రైతుబంధు అమలు చేయాలని కోరుతూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా దీక్షాదివస్ కార్యక్రమం నిర్వహించి కార్యకర్తలను ముందుకు నడిపించారు. ఇటీవల కొంతకాలం నుంచి ఎమ్మెల్సీ కవిత సైతం రెగ్యులర్‌గా జిల్లాలో పర్యటిస్తున్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా వరుస కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. మండలాలతో పాటు జిల్లా కేంద్రంలోనూ ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి కార్యక్రమాల నిర్వహణలో ముందుంటున్నారు.


బుస్సాపూర్ సభకు..

రైతుల ఆత్మహత్యలపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ అధ్యయన కమిటీ మొదలు పెట్టిన యాత్ర శనివారం జిల్లాకు వచ్చింది. ఈ సందర్భంగా బాల్కొండ నియోజకవర్గంలోని బుస్సాపూర్‌లో రైతులతో నిర్వహించిన సభకు మంచి స్పందన వచ్చింది. రైతులు తమ సమస్యలను ఏకరవు పెట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అసమర్థ పాలన కారణంగా 409 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఒక్కటేనని అన్నారు. గోదావరి, కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోయే కుట్ర జరుగుతుంటే రేవంత్ సర్కార్ సోయిలేకుండా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో కిరాయి కాంగ్రెస్ పాలన సాగుతోందన్నారు. రైతులను నమ్మించి మోసం చేశారన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఒక్క రైతు ఆత్మహత్య చేసుకోలేదని పార్లమెంట్ సాక్షిగా దేశ ప్రధాని మోదీ ప్రకటించారని గుర్తుచేశారు. ప్రజాసమస్యల విషయమై పార్టీ నాయకత్వం క్షేత్రస్థాయిలో పోరుబాటకు దిగడంతో పార్టీ శ్రేణులు యాక్టివ్ అవుతున్నారు. నవీపేట మండలం మట్టయ్యఫారంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు కేతావత్ పీర్‌చంద్ కుటుంబానికి వేముల ప్రశాంత్‌రెడ్డి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించారు.

రైతు ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే..

- రాష్ట్రంలో ఏడాదిలో 409 మంది అన్నదాతల బలవన్మరణం
- బీఆర్‌ఎస్ రైతు అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి, చిత్రంలో జోగు రామన్న, సత్యవతి రాథోడ్, వేముల, బాజిరెడ్డి

బాల్కొండ: రాష్ట్రంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యలు అన్నీ ప్రభుత్వ హత్యలేనని బీఆర్‌ఎస్ రైతు అధ్యయన కమిటీ చైర్మన్ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మెండోరా మండలం బుస్సాపూర్ గ్రామంలో కమిటీ సభ్యులు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులకు భరోసా కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడాదిలో 409 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ డిక్లరేషన్‌ల పేరుతో హామీలు ఇచ్చారన్నారు. ఇప్పుడు వారు వచ్చి రాష్ట్రంలో ఎన్ని హామీలు అమలు అవుతున్నాయో పరిశీలించాలని కోరారు. కాంగ్రెస్ రైతులను మోసం చేస్తుంటే ఎంపీ అర్వింద్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. రైతుల ఆత్మహత్యలపై వ్యవసాయ కమిషన్‌కు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక అందిస్తామన్నారు. రైతులో రాజును చూసిన కేసీఆర్‌ను ఎందుకు వదులుకున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారన్నారు. రైతుల తరఫున నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్, జోగు రామన్న, సత్యవతి రాథోడ్, అంజయ్య, రసమయి బాలకిషన్, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు గడువు తేదీని పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ తెలిపారు. ఈ నెల 27 నుంచి 29 వరకు ప్రవేశాలకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రవేశ రుసుమును ఆన్‌లైన్‌లో చెల్లించి అడ్మిషన్ పొందాలని సూచించారు.

ఉచిత శిక్షణ గడువు..

నిజామాబాద్ అర్బన్: ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ గడువును ఫిబ్రవరి 15 వరకు పొడిగించినట్లు మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు జిల్లాలో ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ అందించనున్నట్లు వివరించారు. దీని కోసం ఆఫ్‌లైన్ ద్వారా డిగ్రీ పూర్తి చేసుకున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నాలుగు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ధ్రువీకరణపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 97003 51786 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మహిళామణులు.. పారిశ్రామికవేత్తలు

- స్వశక్తితో ఎదుగుతూ.. ఆదర్శంగా నిలుస్తూ..
- రాజ్యాంగం స్ఫూర్తితో రాణిస్తున్న అతివలు

దేశంలోని ప్రతి ఒక్కరికీ హక్కులు కల్పించడంతోపాటు అవకాశాలను కల్పించిన భారత రాజ్యాంగం స్ఫూర్తిగా మహిళామణులు పారిశ్రామిక వేత్తలుగా రాణిస్తున్నారు. స్వయం సహాయ సంఘాల ద్వారా తాము తీసుకున్న చిన్నచిన్న రుణాలతో వ్యాపారాలు చేస్తూ తమ కుటుంబ, దేశ ప్రగతిలో భాగస్వాములవుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పారిశ్రామిక వేత్తలుగా రాణిస్తున్న మహిళామణులపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– నిజామాబాద్ సిటీ/డొంకేశ్వర్/మోర్తాడ్/మాక్లూర్



ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్

నిజామాబాద్ నగరానికి చెందిన ఐదుగురు మహిళలు స్వప్నారెడ్డి, స్వాతి, కీర్తన, మంగమ్మ, సంధ్య దుర్గామాత సమాఖ్య సభ్యులు. మున్సిపల్ ప్రాజెక్టు ఆఫీసర్ చిదుర రమేశ్ సూచనలతో సమాఖ్య నిధులతో ప్రభుత్వ ఆస్పత్రిలో క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లాకేంద్ర ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇందిరా మహిళా శక్తి పేరుతో క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. 24 గంటలపాటు టీ, టిఫిన్స్, భోజనం అందిస్తున్నారు. దుర్గామాత సమాఖ్య నుంచి రూ.6 లక్షల రుణం తీసుకుని, దానికి తమ వంతుగా మరో రూ.2.5 లక్షలు కలిపి క్యాంటీన్‌ను ఏర్పాటుచేశారు. వీరు ప్రతినెలా రూ.50 వేల ఆదాయం పొందుతున్నారు.

బిల్డింగ్‌మెటీరియల్ సరఫరా



నగరంలోని కోటగల్లికి చెందిన ఉన్నత విద్యావంతురాలు అవ్వదగిరి రంజిత. బీఎస్సీ, బీఈడీ చదివి ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా వినూత్నంగా ఏదైనా చేయాలని తలచింది. మున్సిపల్ ప్రాజెక్టు అధికారి చిదుర రమేష్, మెప్మా అధికారి అశోక్ సూచనలతో తోటి సంఘ సభ్యులు మాధవి, జ్యోతి, స్రవంతి, అనురాధతో కలిసి బిల్డింగ్ మెటీరియల్ బిజినెస్ ప్రారంభించారు. నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో 'శ్రీలక్ష్మీ నరసింహస్వామి బిల్డింగ్ మెటీరియల్స్' పేరుతో గృహ నిర్మాణాలకు కావాల్సిన మెటీరియల్‌ను సరఫరా చేస్తున్నారు. ఇసుకను కాళేశ్వరం నుంచి టెండర్ల ద్వారా తెప్పిస్తున్నారు. కంకరను క్వారీల నుంచి నేరుగా కొనుగోలుచేస్తున్నారు. మొరంను అధికారికంగా కొనుగోలుచేస్తున్నారు. వీరు సమాఖ్య నుంచి రూ. 15 లక్షల రుణం పొందారు. తమ వంతుగా మరో రూ.20 లక్షలు వేసి వ్యాపారాన్ని ప్రారంభించారు.

స్టీల్ బ్యాంక్ నిర్వహణ



నిజామాబాద్ పట్టణ సమాఖ్య సభ్యులు న్యాల్‌కల్ రోడ్డులో 'స్టీల్ బ్యాంక్'ను ఏర్పాటుచేశారు. ప్లాస్టిక్ వాడకుండా స్టీల్ ప్లేట్లు, గ్లాస్‌లు, గిన్నెలు, వంట సామగ్రిని అద్దెకు ఇస్తున్నారు. దీనిని సమాఖ్య అధ్యక్షురాలు పద్మజ నిర్వహిస్తున్నారు.

ఇక్కడి పచ్చళ్లు విదేశాలకు..



పచ్చడి తయారీ చేస్తున్న సురేఖ

అందరిలా కాకుండా భిన్నమైన రంగాన్ని ఎంచుకొని అందులో ఉపాధి పొందుతూ అందరినీ తనవైపు మళ్లించుకుంది వేల్పూర్‌మండల కేంద్రానికి చెందిన పడాల సురేఖ. మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉన్న ఆమెకు బ్యాంకు లింకేజీ రుణం, పీఎంఈజీపై ద్వారా వచ్చే సొమ్ముతో స్వయం ఉపాధి పొందాలనుకుంది. అందరిలా కాకుండా పచ్చళ్ల తయారీని ఎంపిక చేసుకుని అందులో రాణించడం సురేఖ విజయంలో భాగమైంది. నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన వెజ్, నాన్‌వెజ్ పచ్చళ్ల తయారీ ఇక్కడే కాకుండా విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగారు. పరిమితంగానే పచ్చళ్ల తయారీ సాగుతున్నా విదేశాలకు ఆర్డర్లపై పంపించడం సంతోషంగా ఉందని ఆమె అన్నారు. మామిడి, ఉసిరి, నిమ్మ, టమాటా, గోంగూర పచ్చళ్లతో పాటు చికెన్, మటన్, చేప పచ్చళ్లను తయారు చేస్తున్నారు. వెజ్ పచ్చళ్లకు కిలోకు రూ.400, చికెన్ పచ్చడికి కిలోకు రూ.850, మటన్, చేప పచ్చళ్లకు రూ.1,200లకు విక్రయిస్తున్నారు. అమెరికా, దుబాయి, సౌదీ, ఖతర్, ఒమాన్, బహ్రెయిన్, సింగపూర్, మలేషియా దేశాలకు తమ పచ్చళ్ల ఎగుమతి సాగుతుందని సురేఖ వివరించారు.

శిక్షణలో అందెవేసిన చేయి

మొదట టైలరింగ్‌నే ఉపాధిగా ఎంచుకున్న సురేఖ ఈ రంగంలో అనేక మంది యువతులకు శిక్షణ ఇచ్చారు. టైలరింగ్ అంతగా లాభసాటి కాకపోవడంతో పచ్చళ్ల తయారీని ఎంచుకున్నారు. తన వద్దకు టైలరింగ్‌లో శిక్షణ పొందిన యువతులకు పచ్చళ్ల తయారీలోను తర్ఫీదు ఇచ్చారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో ప్రత్యేకంగా పచ్చళ్ల స్టాళ్లను నిర్వహిస్తున్న సురేఖ ఈ రంగంలో మరింత రాణించాలని కోరుకుందాం.

టైలరింగ్‌తో మొదలుపెట్టి సూపర్ మార్కెట్ వరకు..



డొంకేశ్వర్‌లో సూపర్ మార్కెట్ నిర్వహిస్తున్న జ్యోత్స్న

డొంకేశ్వర్(ఆర్మూర్): పట్టుదలతో ఏ రంగంలోనైనా రాణించొచ్చని నిరూపిస్తున్నారు డొంకేశ్వర్ మండల కేంద్రానికి చెందిన కందనూరి జ్యోత్స్న. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాలను అందిపుచ్చుకుని టైలరింగ్‌తో మొదలైన వ్యాపారాన్ని బట్టల కొట్టు, సూపర్ మార్కెట్ వరకు తీసుకెళ్లింది. జ్యోత్స్నది మధ్య తరగతి కుటుంబం. గ్రామంలోని చామంతి మహిళా సంఘం (ఎస్‌హెచ్‌జీ)లో సభ్యురాలు. ఉపాధి మార్గాలను అన్వేషిస్తూ ఇరవై ఏళ్ల కిత్రం టైలరింగ్ ప్రారంభించింది. మరేదైనా వ్యాపారం చేయాలనే ఆలోచనతో పదేళ్ల క్రితం రూ.2లక్షల బ్యాంకు లింకేజీ రుణం తీసుకుంది. ఆ డబ్బులతో తన ఇంటి వద్ద చిన్నగా బట్టల కొట్టును ఏర్పాటు చేసుకుంది. వస్త్రాలు విక్రయించగా వచ్చిన లాభాలతోపాటు మధ్యలో మళ్లీ రుణాలు పొందుతూ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంది. తక్కువ పెట్టుబడితో మొదలైన వ్యాపారాన్ని ప్రస్తుతం రూ.10లక్షల వరకు తీసుకెళ్లింది. బట్టల కొట్టుతోపాటు మరో వ్యాపారం చేయాలనే లక్ష్యంతో గతేడాది సుమారు రూ.5లక్షల రుణం పొంది సూపర్ మార్కెట్‌ను ప్రారంభించింది. వచ్చిన ఆదాయాన్ని పిల్లల పైచదువులకు, కుటుంబ పోషణకు ఉపయోగిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. స్వయం కృషితో వ్యాపార రంగంలో రాణించి ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న జ్యోత్స్నను పలువురు అభినందిస్తున్నారు.

విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న రైతు



ఇంటిపై అమర్చుకున్న సోలార్‌ను వినియోగిస్తూ మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయిస్తూ లబ్ధి పొందుతున్నాడు మాక్లూర్ మండలంలోని వల్లభాపూర్‌కు చెందిన సూర్యప్రకాశ్. తన వ్యవసాయ భూమిలో సూర్యప్రకాశ్ ఇంటిని నిర్మించుకున్నాడు. విద్యుత్ కోసం ఇంటిపై ఐదేళ్ల క్రితం ఆదానీ కంపెనీకి చెందిన సోలార్‌ను రూ.లక్షా 85వేలు వెచ్చించి ఏర్పాటు చేయించాడు. ప్రభుత్వం రూ.60 వేలు సబ్సిడీ ఇచ్చింది. ప్రతి రోజూ 12 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతోందని సోలార్ అమర్చుకుంటే చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలుపుతున్నారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం

సోలార్‌తో ఇంటి అవసరాలు పోను విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించి లబ్ధి పొందొచ్చు. ప్రభుత్వం యూనిట్‌కు రూ.4.50 చెల్లిస్తోంది. నెలకు 150 యూనిట్ల విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయిస్తున్నా. – కె సూర్యప్రకాశ్, వల్లభాపూర్, మాక్లూర్

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల వ్యవస్థ పునాది



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

నిజామాబాద్ అర్బన్: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల వ్యవస్థ పునాదిగా నిలుస్తోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ఓటరు దినోత్సవం పురస్కరించుకొని కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయాల్సిందిగా వచ్చిన అభ్యర్థనలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ మంచి పాలకులను ఎన్నుకోవడంలో ప్రతి ఓటూ ఎంతో కీలకమైందన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో క్రమం తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుంటున్న 80 ఏళ్లు పైబడిన నాగుల సాయమ్మ, కొట్టూర్ ఇందిర, అవధూత భూమయ్య, మెరుగు ఒడ్డెమ్మ, అంకం సుశీల, వై నర్సయ్యలను ఘనంగా సన్మానించారు. కొత్తగా నమోదైన యువ ఓటర్లను ఓటరు ఐడీలను అందించి సత్కరించారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, జిల్లా స్వీప్ అధికారి సురేష్ కుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్ పాల్గొన్నారు.

తెయూ నూతన వెబ్‌సైట్ ఆవిష్కరణ



నూతన వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ నూతన వెబ్‌సైట్‌ను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు శనివారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీలో పని చేస్తున్న అధికారుల సమగ్ర వివరాలతోపాటు వర్సిటీ అందించే వివిధ కోర్సులు, అనుబంధ కళాశాలలు, వాటిలో అందించే కోర్సుల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. వర్సిటీలోని వివిధ విభాగాలతో పాటు పరీక్షల విభాగం, అకడమిక్ ఆడిట్ సెల్, అడ్మిషన్స్, ఐక్యూఏసీ, ఎన్ఎస్ఎస్, హాస్టళ్ల తదితర విభాగాల వివరాలను అందుబాటులో ఉంచామన్నారు. నోటిఫికేషన్లు, పరీక్షల తేదీలు తదితర వివరాలను ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, వైబ్‌సైట్ అండ్ నెట్‌వర్క్ డైరెక్టర్ అతీక్ సుల్తాన్ ఘోరీ, డాక్టర్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి'

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎల్ఎల్‌బీ పరీక్షలకు సంబంధించిన రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి–2025 ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ రెగ్యులర్/బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలకు హాజరైన విద్యార్థులు మాత్రమే రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని స్పష్టం చేశారు. ఒక్కో పేపర్‌కు రూ.500, రీవాల్యుయేషన్ ఫామ్‌కు రూ.25 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. దరఖాస్తు చేసుకునేందుకు జనవరి 29 తుదిగడువని సూచించారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు శ్రావ్య



జక్కం శ్రావ్య

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జక్కం శ్రావ్య 68వ స్కూల్ గేమ్స్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రావ్య ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు మహారాష్ట్రలోని శంభాజీనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయస్థాయి అండర్–19 సాఫ్ట్‌బాల్ పోటీల్లో శ్రావ్య పాల్గొననుందని ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగామోహన్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన శ్రావ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆర్మూర్‌టౌన్: విద్యుత్ లైన్‌ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఆర్మూర్ డివిజన్ పరిధిలోని పోచంపాడ్, మోర్తాడ్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ డీఈ రాజేశ్వర్‌రావు శనివారం తెలిపారు. ఆదివారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు విద్యుత్ కెపాసిటీ లైన్‌ల మరమ్మతుల్లో భాగంగా పోచంపాడ్, తాళ్లరాంపూర్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని వ్యవసాయ క్షేత్రాలకు ఉదయం 7 నుంచి 8గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. అలాగే మోర్తాడ్, పాలెం సబ్ స్టేషన్‌ల పరిధిలో ఉదయం 8 నుంచి 9గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యభిచార గృహాలపై దాడి

- ఇద్దరు నిర్వాహకులపై కేసు నమోదు
- స్వధార్ హోంకు 8మంది మహిళల తరలింపు
- విటుల వివరాలు గోప్యంగా ఉంచడంపై అనుమానాలు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని లక్కంపల్లి శివారు ప్రాంతంలో ఉన్న సురేశ్‌నగర్ కాలనీ సమీపంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి నేతృత్వంలో పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. నందిపేట ఎస్సై చిరంజీవి, సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది పోలీసు బృందం సభ్యులు పలు గృహాలపై ఆకస్మికంగా దాడి చేశారు. వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. బాధితులుగా ఉన్న ఎనిమిది మంది మహిళలను రెస్క్యూ చేసి నిజామాబాద్‌లోని స్వధార్ హోమ్‌కు తరలించారు. అయితే ముగ్గురు విటులను అదుపులోకి తీసుకున్నప్పటికీ వారి వివరాలను గోప్యంగా ఉంచారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వ్యభిచార గృహం నిర్వహిస్తున్న వారిపై మాత్రమే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు ప్రకటించడం చర్చకు దారితీసింది. విటులు లేకుండా వ్యభిచారం జరుగుతుందని పోలీసులు ఎలా నిర్ధారణకు వచ్చారని, ఒకవేళ విటులను అదుపులోకి తీసుకుంటే పోలీసులు ఆ విరాలను గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

క్రైం కార్నర్

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు

- ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన లారీ
- తండ్రి మృతి..తల్లి, పిల్లలకు గాయాలు



రవి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అంత్యక్రియలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా శనివారం ఉదయం మండల కేంద్రం శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇందల్‌వాయి మండలం నల్లవెల్లికి చెందిన లింగాపురం రవి(36) తన భార్య లావణ్య ఇద్దరు పిల్లలతో కలిసి ఎండ్రియాల్‌లో నిర్వహించిన బంధువు అంత్యక్రియలకు హాజరయ్యాడు. ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తుండగా కామారెడ్డి వైపు నుంచి నిజామాబాద్ వైపునకు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడడంతో రవి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఎగిరి రోడ్డు పక్కన పడగా గాయాలయ్యాయి. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గోడకు కన్నం వేసి సూపర్ మార్కెట్లో చోరీ



కామారెడ్డి క్రైం: గోడకు రంధ్రం చేసి సూపర్ మార్కెట్‌లోకి చొరబడిన దుండగులు నగదు తోపాటు కిరాణా సామగ్రిని ఎత్తుకెళ్లిన ఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో అశోక్‌నగర్ వెళ్లే దారిలో ఉన్న విజయ సూపర్ మార్కెట్‌ను శుక్రవారం రాత్రి 11 గంటలకు నిర్వాహకులు మూసివేసి వెళ్లిపోయారు. ఉదయం వచ్చి చూడగా షాపులో గోడకు రంధ్రం ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. దుండగుడు సూపర్ మార్కెట్ వెనకాల ఉన్న చర్చి కంపౌండ్ గోడ పైనుంచి దూకి వచ్చి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. దుండగుడు కౌంటర్‌లోని రూ.30వేల నగదుతోపాటు కిరాణా సామగ్రి ఎత్తుకెళ్లినట్లు సూపర్ మార్కెట్ యజమాని ఫిర్యాదు చేశాడని సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జాతీయస్థాయి క్రీడలకు డిప్యూటీ చీఫ్ ది మిషన్‌గా సంజీవరెడ్డి



ఈగ సంజీవరెడ్డి

నిజామాబాద్ నాగారం: ఉత్తరాఖండ్‌లో జరగనున్న జాతీయస్థాయి క్రీడలకు డిప్యూటీ చీఫ్ ది మిషన్(డీసీడీఎం)గా ఈగ సంజీవరెడ్డి నియమితులయ్యారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 14వరకు పోటీలు జరగనున్నాయి. సంజీవరెడ్డి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

రైతు భరోసా, ఆత్మీయ భరోసాకు శ్రీకారం

- జిల్లాలో మండలానికి ఒక గ్రామంలో ప్రారంభం

డొంకేశ్వర్(ఆర్మూర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా రిపబ్లిక్ డే నాడు ఆదివారం రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాలకు శ్రీకారం చుట్టనుంది. గ్రామ సభలను పూర్తి చేసుకున్న జిల్లా యంత్రాంగం పథకాల పంపిణీకి అర్హులైన లబ్ధిదారుల జాబితాను రెడీ చేసింది. మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసిన అధికారులు లాంఛనంగా పథకాల పంపిణీని ప్రారంభించనున్నారు.

పంటలు సాగు చేస్తున్న రైతులకు పంట పెట్టుబడి సాయంగా ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేలు ఇవ్వనుండగా, జిల్లాలో 2.80 లక్షల మంది వరకు అర్హులు ఉండే అవకాశం ఉంది. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతుల నుంచి కూడా వ్యవసాయాధికారులు దరఖాస్తులు తీసుకుంటున్నారు. 14,067 కొత్త పాసుపుస్తకాలు ఉన్నట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. దీంతో రైతు భరోసా లబ్ధిదారుల సంఖ్య పెరగనుంది. అదే విధంగా ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా పథకం కింద భూమి లేని రైతులు గరిష్టంగా 20 రోజుల పాటు ఉపాధిహామీ పనులకు వచ్చిన వారు 38,827మంది ఉన్నారు. వీరికి ఏడాదికి రెండు విడతల్లో కలిపి రూ.12 వేలు సాయం ఇవ్వనుంది. రైతు భరోసా, ఆత్మీయ భరోసా లబ్ధిదారులకు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రొసీడింగ్ కాపీలు ఇవ్వనున్నారు.